పోస్టాఫీసు స్థలంలో దుర్గంధం



అద్దె భవనంలో కొన సాగుతున్న చింతలపూడి పోస్టాఫీసు



పోస్టాఫీసు స్థలం

- అద్దె భవనంలో అవస్థలు
- పట్టించుకోని అధికారులు

చింతలపూడి : స్థానిక పోస్టాఫీసు స్థలానికి మోక్షం ఎప్పుడని పట్టణ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. పట్టణ నడిబొడ్డున, బీఎస్ఎన్ఎల్ కార్యాలయం పక్కన ఉన్న కోట్లాది రూపాయల విలువ చేసే స్థలం ప్రస్తుతం ముళ్లపొదలు, చెత్తా చెదారంతో నిండి నిరుపయోగంగా ఉంది. గతంలో సంబంధిత అధికారులు దీన్ని శుభ్రం చేయించి స్థలం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. నాటి నుంచి దీని పర్యవేక్షణ లేకపోవడంతో ఆ స్థలంలో స్థానికులు చెత్తా చెదారం పోయడంతో దుర్గంధం వెదజల్లుతుంది.

నిధుల లేమి

పోస్టాఫీసుకు స్థానిక ఆశ్రమం వీధిలో సుమారు 12 సెంట్ల స్థలం ఉంది. ఇది సుమారు రూ.2 కోట్లకు పైగా విలువ చేస్తుంది. చాలా కాలంగా ఈ స్థలంలో పోస్టాఫీసుకు భవనం నిర్మించాలని వినియోగదారులు కోరుతున్నారు. అయితే పోస్టల్ శాఖ నిధులు కేటాయించక పోవడం వల్ల భవన నిర్మాణం చేపట్టలేదు. దీంతో నెలకు వేలాది రూపాయలు చెల్లించి ఏళ్ల తరబడి పోస్టాఫీసును అద్దెభవనంలో కొనసాగిస్తున్నారు. ఈ పోస్టాఫీస్ పరిధిలో పని చేస్తున్న గ్రామీణ పోస్టల్ ఉద్యోగులు సైతం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా పోస్టల్ శాఖ స్పందించి సొంత భవనానికి నిధులు కేటాయించాలని పలువురు కోరుతున్నారు.

సొంత భవనం నిర్మించాలి



పోస్టల్ కార్యాలయానికి సొంత భవనం నిర్మించాలి. చాలీచాలని భవనంలో ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. గతంలో అనేక సార్లు కేంద్ర, రాష్ట్ర మంత్రులకు వినతిపత్రం అందించాం. పోస్టల్ శాఖ ఉన్నతాధికారులు శాశ్వత భవనానికి నిధులు కేటాయించాలి.

– ఎస్కే ఆజాద్‌బాబు,
అజీమ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, చింతలపూడి

'చలో ప్రభుత్వ మెడికల్ కాలేజీ'కి తరలిన శ్రేణులు



జంగారెడ్డిగూడెం : ఏలూరు వెళుతున్న నాయకులు



ద్వారకాతిరుమల : రాజమండ్రి వెళుతున్న నాయకులు

జంగారెడ్డిగూడెం: చలో ప్రభుత్వ మెడికల్ కాలేజీ కార్యక్రమానికి జంగారెడ్డిగూడెం పట్టణ, మండలం నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు ఏలూరుకు భారీగా తరలివెళ్లారు. వాహనాలను జంగారెడ్డిగూడెం పట్టణ అధ్యక్షులు కర్పూరం గవరయ్య గుప్త, యువజన నాయకులు ఆదిత్య జెండా ఊపి ప్రారంభించారు. జిల్లా యువజన విభాగ కార్యదర్శి మహమ్మద్ ఉమర్ షరీఫ్ ఆధ్వర్యంలో యువత ఏలూరు వెళ్లారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ ఆపాలని డిమాండ్ చేశారు. పట్టణ యువజన విభాగ అధ్యక్షుడు నేకూరి కిషోర్, మండల యువజన విభాగం అధ్యక్షుడు గంజి వినోద్, మండల విద్యార్థి విభాగం అధ్యక్షుడు సంద్ర రాము, కౌన్సిలర్ ఉగ్గం దుర్గాప్రసాద్, టౌన్ బూత్ కమిటీల కన్వీనర్ కాసర శేషారెడ్డి, నాయకులు షేక్ రఫీ, కళ్యాణ్ వర్మ, మానుకొండ అశోక్, జమీరు, సాబోలు రవి, నీలపాల అనిల్, నల్లమిల్లి సన్నీ, వీరంకి మాధవ, కొత్తూరు పెద్ద, ముప్పిడి జగదీష్, సగళ్ల ఏసుబాబు, అమర్, దిరిసిపాము సోమరాజు, కొండ, సత్తార్, దయ, యాక్టర్ భాష, గంట శివ, మోటూరు మణి వెళ్లారు.

'చలో రాజమండ్రి'కి మండల నాయకులు

ద్వారకాతిరుమల: ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ శుక్రవారం చేపట్టిన చలో రాజమండ్రి కార్యక్రమానికి మాజీ హోం మంత్రి తానేటి వనిత ఆధ్వర్యంలో మండలానికి చెందిన నాయకులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. వీరంతా పార్టీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు జక్కంపూడి రాజా నివాసానికి, అక్కడి నుంచి ప్రభుత్వ మెడికల్ కళాశాలకు బయలుదేరారు. అక్కడ పోలీసులు అడ్డుకోవడంతో వారు ఆందోళనకు దిగారు. సీఎం చంద్రబాబుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రైవేటీకరణను ఆపకపోతే ఊరుకోబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, రాష్ట్ర యువజన విభాగ సంయుక్త కార్యదర్శి పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్, రాష్ట్ర మైనారిటీ సెల్ సంయుక్త కార్యదర్శి షేక్ మస్తాన్ బాష, మండల కన్వీనర్ మల్లిపూడి నాగమణి, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు దాసరి రాంబాబు, పంగిడిగూడెం, ఐఎస్ రాఘవాపురం సర్పంచ్‌లు ప్రత్తిపాటి యోహాను, పసుపులేటి ఏసుబాబు, చెలికాని బుల్లియ్య, పెద్దిరెడ్డి నాగేశ్వరరావు, జి.కొత్తపల్లి, కొమ్మర ఎంపీటీసీలు బిరుదుగడ్డ బజారియ్య, మానుకొండ కన్నయ్య, దాసరి ఏసురత్నం, గుమ్మడి శ్రీను, భోగరాజు చిన్ని, బొంతు శ్రీను తదితరులున్నారు.

22 నుంచి దసరా ఉత్సవాలు



దసరా ఉత్సవాల కరపత్రం విడుదల చేస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: స్థానిక పద్మా థియేటర్ ఎదురుగా ఉన్న శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం వద్ద వారాహి అమ్మవారి దసరా శరన్నవరాత్రులు ఈనెల 22 నుంచి నిర్వహించనున్నట్టు అర్చకులు కూరెళ్ల రాంబాబు శర్మ తెలిపారు. ఈ మేరకు ఆలయం వద్ద ఉత్సవాల కరపత్రం విడుదల చేశారు. రోజుకో అవతారంలో అమ్మవారి దర్శనం ఉంటుందని తెలిపారు.

అమ్మవార్లకు పూజలు

జంగారెడ్డిగూడెం: స్థానిక ముత్యాలమ్మ, నూకాలమ్మ, ఆర్యవైశ్య కళ్యాణ మండపం వద్ద శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి, గుర్వాయగూడెం అయ్యప్ప ఆలయంలో జ్ఞాన సరస్వతి ఆలయాల్లో అమ్మవార్లకు శుక్రవారం సందర్భంగా విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారు. తీర్థప్రసాదాలను స్వీకరించారు. నూకాలమ్మ వెండి చీర తయారీకి ఎం లలిత 7 తులాలు, ముక్కు భాస్కర వెంకట విశ్వేశ్వరరావు ప్రమీల దేవి దంపతులు 6 తులాలు, తెల్లగొర్ల రత్నకుమారి కుటుంబ సభ్యులు 5 తులాల వెండిని అందజేశారని ఆలయ శాశ్వత చైర్మన్ రాజాన సత్యనారాయణ, ఆలయ కమిటీ చైర్మన్ రొంగల నాగేశ్వరరావు తెలిపారు. దాతలను ఆలయ మర్యాదలతో సత్కరించామని చెప్పారు.

ప్రభుత్వంపై మోగిన రణభేరి



సదస్సులో పాల్గొన్న ఉపాధ్యాయులు

జంగారెడ్డిగూడెం: ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం పట్ల నిరసన వ్యక్తంచేస్తూ చేపట్టిన రణభేరి బైక్ జాతా శుక్రవారం జంగారెడ్డిగూడెం చేరింది. స్థానిక బాలుర హైస్కూల్ వద్ద ఉపాధ్యాయులను ఉద్దేశించి జిల్లా నాయకులు ఎంవీ శ్యాంబాబు, ముస్తఫా ఆలీ, రవికుమార్‌లు మాట్లాడారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనులు అధికంగా ఉన్నాయని, అనేక యాప్‌ల పని భారంతో సతమతం అవుతున్నారని వాపోయారు. ఉపాధ్యాయులకు ఆన్‌లైన్ తరహా శిక్షణల వల్ల వారి బోధన సమయం తగ్గిపోతుందని తెలిపారు. అందుకే నిరసన చేపట్టామన్నారు. యూటీఎఫ్ పోరాటం విజయవంతంగా జరగాలని ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు శివ ప్రసాద్ ఆకాంక్షించారు. అనంతరం యూటీఎఫ్ భవన్‌లో ఏర్పాటుచేసిన సదస్సులో రాష్ట్ర కార్యదర్శి అరుణకుమారి మాట్లాడారు. ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలు పట్టించుకోవడం లేదని, నాలుగు డీఏలు బకాయి ఉన్నాయని, కొత్త పీఆర్సీ సమయం దాటి మూడేళ్లయినా ఇంకా ప్రకటించలేదని, సీపీఎస్ సమస్య అలాగే ఉందని, పీఎఫ్, ఏపీజీఎల్ఐ లోన్లు రావడం లేదని తెలిపారు. రాష్ట్ర కార్యదర్శులు జ్యోతిబాసు, సుభాషిణి మాట్లాడుతూ ఈ నెల 24 వరకు ప్రభుత్వం స్పందించాలని, లేకుంటే 25న గుంటూరులో భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని వెల్లడించారు.

పొగాకు సాగుపై అవగాహన



జీలుగుమిల్లిలో రైతులకు ఉచితంగా విత్తనాలు, ప్రోట్రేలను పంపిణీ చేస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: వర్జీనియా పొగాకులో మేలు రకం వంగడాలు, వాటి సాగు విధానంపై రైతులు పూర్తి అవగాహన పెంచుకోవాలని జీలుగుమిల్లి పరిశోధనా కేంద్రం హెడ్ వైవీ సుబ్బయ్య అన్నారు. ఐసీఏఆర్ ఎన్ఐఆర్‌సీఏ డైరెక్టర్ డాక్టర్ మాగంటి శేషుమాధవ్ ఆదేశాల మేరకు జీలుగుమిల్లి జాతీయ వాణిజ్య పరిశోధనా కేంద్రంలో శుక్రవారం షెడ్యూల్ కులాల ఉపప్రణాళిక అములులో భాగంగా పొగాకు సాగు విధానంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథి సుబ్బయ్య మాట్లాడుతూ ఎన్ఐఆర్‌సీఏ (సీటీఆర్ఐ) పరిశోధనల్లో ఉత్తర ప్రాంత తేలిక నేలల్లో సాగుకు అనువైన అధిక దిగుబడిని ఇచ్చే మేలు రకపు ఎఫ్‌సీజే-11 (నవీన) సాగులో అధిక దిగుబడికి, ఉత్తమ నాణ్యతకు పాటించాల్సిన ఉత్తమ యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించారు. పొగాకు సాగులో యాంత్రీకరణ అభివృద్ధికి రూపొందించిన వివిధ రకాల టెక్నాలజీలను తెలియజేశారు. ఈ సందర్భంగా 100 మంది రైతులకు ఎఫ్‌సీజే-11 పొగాకు విత్తనాలు, ప్రోట్రేలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టి.రమేష్, ఎ.ప్రభు, జి.శ్రీనివాసరావు, జీఎస్ఎం అన్నపూర్ణ, బి.దుర్గారావు, టి.శ్రీనివాసరావు, ఈ.వీరభద్రరావు, పొగాకు రైతులు, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మర్యాదపూర్వక కలయిక



మాజీ సీఎం జగన్‌ను కలిసిన సోమశేఖర్

జంగారెడ్డిగూడెం: మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆ పార్టీ జంగారెడ్డిగూడెం పట్టణ ప్రధాన కార్యదర్శి చిత్తపూరి సోమశేఖర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రతి గడపకూ ప్రభుత్వ వైఫల్యాలను తీసుకెళ్లి ప్రజలను చైతన్యం చేయాలని అధినేత సూచించారని సోమశేఖర్ తెలిపారు.

వైద్యం ప్రైవేటీకరణ దారుణం



బుట్టాయగూడెం: ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేయడం దారుణమని మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. మండలంలోని దుద్దుకూరులో శుక్రవారం సాయంత్రం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వ విధానాలను ఎండగడుతూ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు చేపట్టిన చలో మెడికల్ కాలేజీ కార్యక్రమాన్ని అడుగడుగునా పోలీసులు అడ్డుకోవాలని ప్రయత్నించినప్పటికీ విజయవంతమైందని చెప్పారు. ప్రజలు, నాయకులు, యువకులు, స్వచ్ఛందంగా తరలి వచ్చారని తెలిపారు. ప్రభుత్వ వైద్యకళాశాల ప్రైవేటీకరణను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో రాష్ట్రంలో మెడికల్ కాలేజీల ఏర్పాటు చేపట్టామని, పలు కళాశాలల నిర్మాణం పూర్తయిందని చెప్పారు. కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ నిర్ణయంతో పేద విద్యార్థులకు వైద్య విద్య అందే అవకాశం లేకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ తీరును ప్రతిఒక్కరూ వ్యతిరేకంచాలని, తీవ్రంగా ఖండించాలని బాలరాజు కోరారు.

'ఆదికర్మ యోగి అభియాన్' అభివృద్ధికి కీలకం

బుట్టాయగూడెం: ఆదికర్మ యోగి అభియాన్ పథకం గిరిజన ప్రాంతాల అభివృద్ధికి కీలకమని ఐటీడీఏ పీఓ కె.రాములు నాయక్ అన్నారు. ఈ పథకం అమలుపై శుక్రవారం కేఆర్‌పురం ఐటీడీఏ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. సమన్వయంతో పనిచేసి పథకాలను సమయానికే పూర్తి చేయాలని సూచించారు. గిరిజన వ్యవహారాల మంత్రిత్వశాఖ (మోటా) ప్రాజెక్టు అధికారి రిషబ్ చతుర్వేది, సీనియర్ కన్సల్టెంట్ (స్ట్రాటజీ) స్వాతి బాత్రాలు మాట్లాడుతూ ఆదికర్మయోగి అభియాన్ అమలు, గ్రామస్థాయి సామాజిక ప్రజా భాగస్వామ్యం, సామర్థ్యం, వృద్ధి వంటి అంశాలపై సూచనలిచ్చారు. ఎంపీడీఓలు పాల్గొన్నారు.

డివిజన్ స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో పీడీలు

బుట్టాయగూడెం: మండలంలోని రెడ్డిగణపవరం జెడ్పీ హైస్కూల్‌లో మండల స్థాయి ఆటల పోటీలు శుక్రవారం నిర్వహించారు. బాలికల విభాగంలో వాలీబాల్, కబడ్డీ, కోకో, చెస్, యోగా, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల, జెడ్పీ హెచ్ఎస్ స్కూల్, పందిరిమామిడిగూడెం స్కూళ్ల నుంచి సుమారు 214 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వాలీబాల్‌లో 12 మంది, కబడ్డీలో 12 మంది, కోకో 12 మంది, చెక్ 2, యోగా 3, అథ్లెటిక్స్‌లో 32 మంది డివిజన్ స్థాయి పోటీలకు ఎంపికైనట్టు హెచ్ఎం ఎస్ రామారావు తెలిపారు. కార్యక్రమంలో కేఆర్ పురం జోన్ అధ్యక్షులు ఎం బాబూరావు, పీడీలు కె.నాగేశ్వరరావు, జె.చిన్ను, ఆర్ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత నైపుణ్య అభివృద్ధి శిక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న పొగాకు ఆర్ఎం జీఎల్‌కే ప్రసాద్

జంగారెడ్డిగూడెం: నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి పెంపొందించే లక్ష్యంతో పొగాకు బోర్డు ఆధ్వర్యంలో ఉచిత నైపుణ్య అభివృద్ధి శిక్షణ ఇస్తున్నట్టు పొగాకు బోర్డు రీజనల్ మేనేజర్ జీఎల్‌కే ప్రసాద్ తెలిపారు. శుక్రవారం స్థానిక వర్జీనియా వేలం కేంద్రంలో పొగాకు బోర్డు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ భాగస్వామ్యంతో ఉచిత నైపుణ్య అభివృద్ధి శిక్షణ ఇచ్చారు. బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విశ్వశ్రీ పొగాకు వ్యవసాయ కుటుంబాలకు చెందిన 18 నుంచి 35 సంవత్సరాల మధ్య నిరుద్యోగ యువతకు వివిధ వృత్తి నైపుణ్యాలను పెంచే శిక్షణ అందించనున్నట్టు ఆర్ఎం తెలిపారు. ప్రతి బ్యాచ్‌లో కనీసం 30 మంది పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో ఆక్షన్ సూపరింటెండెంట్లు శ్రీహరి, సురేంద్ర, ఏపీఎస్ఎస్‌డీసీ శిక్షకులు, పొగాకు రైతులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

26న ఏపీఎన్జీవోస్ ఎన్నికలు

జంగారెడ్డిగూడెం: ఏపీఎన్జీవోస్ అసోసియేషన్ జంగారెడ్డిగూడెం తాలూకా యూనిట్ ఎన్నికలు ఈనెల 26న స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్టు అసోసియేషన్ అధ్యక్షుడు వై.నరేష్ తెలిపారు. గొరెడ్డిగూడెం, బుట్టాయగూడెం, కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో ఉన్న గెజిటెడ్, నాన్ గెజిటెడ్ ఉద్యోగులు పాల్గొనాలని కోరారు.

నేడు పొంగుటూరుకు కలెక్టర్

కొయ్యలగూడెం: కలెక్టర్ వెట్రిసెల్వి శనివారం పొంగుటూరు గ్రామానికి విచ్చేస్తున్నట్టు సర్పంచ్ పసుపులేటి రాంబాబు తెలిపారు. శనివారం ఉదయం 8 గంటలకు స్వచ్ఛంద, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా పాల్గొంటారన్నారు.

విద్యార్థినులకు సైకిళ్ల బహూకరణ



సైకిళ్లు అందిస్తున్న ఎస్‌బీఐ అధికారులు

ద్వారకాతిరుమల: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఐదుగురికి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శుక్రవారం సైకిళ్లను బహూకరించింది. సామాజిక సేవలో భాగంగా వీటిని బ్యాంక్ ఏలూరు రీజనల్ మేనేజర్ పక్కాల కాళిదాసు, హెచ్ఆర్ మేనేజర్ వెలమల మనోజ్, స్థానిక బ్రాంచి మేనేజర్ లంకా శ్రీనివాస్‌లు 9, 8, 7, 6వ తరగతులు విద్యార్థినులు కర్ని శైలజ, చప్పిడి లక్ష్మి, చప్పిడి మంగమ్మ, మిద్దే జాన్సీలక్ష్మి, బోడ ప్రత్యూషలకు అందజేశారు. ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



సబ్ జైల్‌లో రికార్డులు పరిశీలిస్తున్న జడ్జి మధుబాబు

చింతలపూడి : స్థానిక సబ్ జైల్‌ను జూనియర్ సివిల్ జడ్జి సి.మధుబాబు శుక్రవారం సందర్శించారు. ముద్దాయిలకు అందిస్తున్న ఆహారం, వసతి సదుపాయాలపై ఆరా తీశారు. వంటశాల స్టోర్ రూములను పరిశీలించారు. ఖైదీలకు చట్టాలపై అవగాహన కలిగించారు. ప్రతి ఒక్కరూ హింసా మార్గాన్ని విడనాడాలని పిలుపునిచ్చారు. ఆర్థిక స్థోమతలేని వారికి న్యాయవాదిని లీగల్ సర్వీసెస్ అథారిటీ ద్వారా ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఉపకారాగార పర్యవేక్షణాధికారి కృపానందం, ప్యానల్ లాయర్ జి.విజయరావు, పీఎల్‌వీబీ నాగార్జునసాగర్, జైల్ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి



మాట్లాడుతున్న ఎంపీపీ

లింగపాలెం: క్షేత్రస్థాయిలో గ్రామాల అభివృద్ధి చెందాలంటే, గ్రామాలు ప్రగతి పథంలో నడవాలంటే స్థానిక ప్రజాప్రతినిధుల కృషి ముఖ్యమని ఎంపీపీ ముసునూరు వెంకటలక్ష్మి అన్నారు. శుక్రవారం సాయంత్రం ఏర్పాటుచేసిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. గ్రామాల్లో ఎక్కడ సమస్య ఉన్నా గుర్తించి, పరిష్కరించాలన్నారు. తొలుత వివిధ శాఖల పనితీరుపై సమీక్షించారు. వైస్ ఎంపీపీలు మట్ట సురేష్, కర్లపూడి ఝాన్సీ, ఎంపీడీఓ కె.వాణి, ప్రజాప్రతినిధులుల, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

లింగపాలెం: లైన్ పనుల నిమిత్తం శనివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటలకు వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ కేఎం అంబేద్కర్ తెలిపారు. ధర్మాజీగూడెం సబ్‌స్టేషన్ పరిధి గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని ఆయన పేర్కొన్నారు.

స్కూల్ బస్సుల తనిఖీ

జంగారెడ్డిగూడెం: స్కూల్ బస్సులను నిబంధనలు మేరకు రోడ్లపై తిప్పాలని ఏఎంవీఐలు కేడీవీ రవిగోపాల్, సీహెచ్ సత్యనారాయణలు ఆదేశించారు. జంగారెడ్డిగూడెంలో పలు కళాశాలల, పాఠశాలలకు చెందిన బస్సులను శుక్రవారం స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా తనిఖీ చేశారు. బస్సులకు ఖచ్చితంగా ఫిట్‌నెస్, ఇన్సూరెన్స్, ఎమర్జెన్సీ కిట్, డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలన్నారు. ప్రతి రోజూ కళాశాల, పాఠశాల బస్సులకు తనిఖీ ఉంటుందని చెప్పారు. నిబంధనలు అతిక్రమిస్తే బస్సులను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

గవరవరంలో ఆరోగ్య శిబిరం

కొయ్యలగూడెం: మహిళలు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని వైద్య ఆరోగ్యశాఖ వైద్యులు సూచించారు. శుక్రవారం గవరవరం పంచాయతీ కార్యాలయం వద్ద స్వస్థ నారీ, సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం కొయ్యలగూడెం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో నిర్వహించారు. డాక్టర్ తస్లీమా రోగులను పరీక్షించి, మందులు అందించారు. దంత వైద్యుడు శ్రీనివాస్, సిహెచ్‌ఓ గంగాదేవి, సీహెచ్ఎస్ సుభద్ర కుమారి, ఎంపీ హెచ్ఎస్ మంగారావు తదితరులు పాల్గొన్నారు.

ఎరువులు అవసరం మేరకు వినియోగించాలి

కామవరపుకోట: పంటలకు ఎరువులు, పురుగు మందులు అవసరం మేరకు వినియోగించాలని మండల వ్యవసాయ శాఖ అధికారి డి.ముత్యాలరావు తెలిపారు. శుక్రవారం మండలంలో రావికంపాడు గ్రామంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. వరి వ్యవసాయంలో మిత్ర పురుగులను సంరక్షించుకోవడం ద్వారా పురుగు మందుల ఖర్చును తగ్గించుకోవచ్చని ప్రయోగాత్మకంగా రైతులకు చూపించారు. కార్యక్రమంలో వ్యవసాయ గ్రామ సహాయకులు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై సతీష్‌కుమార్

చింతలపూడి : విద్యార్థి దశ నుండే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్సై కె.సతీష్ కుమార్ అన్నారు. సీఐ కె.క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో స్థానిక బాలికల హై స్కూల్ విద్యార్థునులకు శుక్రవారం చట్టాలపై అవగాహన కల్పించారు. మహిళా చట్టాలు, పోక్సోయాక్ట్, సైబర్ మోసాలపై ఎస్సై మాట్లాడారు. ధ్యానం, క్రీడలు వంటి మార్గాల ద్వారా మానసిక స్థైర్యాన్ని పొందొచ్చన్నారు. సోషల్ మీడియా వేదికల వినియోగంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఆన్‌లైన్లు, ఫేక్ జాబ్ ఆఫర్లు, పర్సనల్ ఫోటో మిస్‌యూజ్ వంటి ఘటనలపై అవగాహన కల్పించారు. చట్టాలు, శిక్షలు, బాధితులు తీసుకోవాల్సిన చర్యలపై మాట్లాడారు. సమస్యలపై 112 హెల్ప్ లైన్ నంబర్ లేదా స్థానిక పోలీస్ అధికారులను నేరుగా సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం చక్రధరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై అక్రమ కేసు

చింతలపూడి : ఎన్నికలు జరిగి ఏడాదిన్నర దాటి పోతున్నా వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టడం తగ్గలేదని ఆపార్టీ నాయకుడు శెట్టిపల్లి మోహన్‌రావు ఆరోపించారు. తాజాగా చింతలపూడి మండలం పట్టాయిగూడెం గ్రామానికి చెందిన మారం అప్పారావు అనే కార్యకర్తపై హత్యాయత్నం కేసు నమోదు చేసి జైలుకు పంపిన ఘటన శుక్రవారం జరిగింది. ఈనెల 4వ తేదీన గణేష్ నిమజ్జనం సందర్భంగా గ్రామంలోని మద్యం బెల్ట్ షాపు వద్ద జరిగిన చిన్న ఘర్షణను ఆసరాగా చేసుకుని అప్పారావు తనపై హత్యాయత్నానికి పాల్పడినట్లు స్వర్ణాల మారేశ్వరి అనే మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి అప్పారావును శుక్రవారం కోర్టుకు హాజరు పరచగా రిమాండ్ విధించారు. ఈ అక్రమ కేసుపై గ్రామానికి చెందిన నాయకులు శెట్టిపల్లి మోహన్‌బాబు, చిగురు పాటి సత్తిబాబు, మారం వెంకటేశ్వరావులు ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ నాయకులు పోలీసులపై ఒత్తిడి తెచ్చి హత్యాయత్నం కేసు పెట్టించారని ఆరోపించారు. గ్రామంలో సమస్యలు ఉంటే కూర్చుని పరిష్కరించుకోవాలని, ఇలా తమ పార్టీ కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి వేధించడం సమంజసం కాదని హితవుపలికారు. పార్టీ కార్యకర్తలను వేధింపులకు గురిచేస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. విషయాన్ని పార్టీ అధ్యక్షులు జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకవెళతామని తెలిపారు.

ఘనంగా ముగిసిన పవిత్రోత్సవాలు

జంగారెడ్డిగూడెం: గోకుల తిరుమల పారిజాత గిరి వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న పవిత్రోత్సవాలు శుక్రవారం పూర్ణాహుతి, కుంభ ప్రోక్షణ ,పవిత్ర అవరోహణ, శాంతి కల్యాణం తదితర కార్యక్రమాలతో ముగిశాయని ఆలయ ఈఓ కలగర శ్రీనివాస్ తెలిపారు. పూజలు నిర్వహించిన రుత్విక్ స్వాములను కార్యనిర్వహణ అధికారి కలగర శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సీఎస్‌టీఎస్ కళాశాలలో అంతర్జాల సదస్సు

జంగారెడ్డిగూడెం: స్థానిక సీఎస్‌టీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు సాహిత్యము సాంకేతికత అనే అంశంపై అంతర్జాతీయ అంతర్జాల సదస్సు శుక్రవారం ప్రిన్సిపాల్ ఎస్ ప్రసాద్‌బాబు అధ్యక్షతన నిర్వహించారు. ఈ అంశంపై 88 పత్ర సమర్పించారు. ప్రత్యక్షంగా 50కి పైగా అంతర్జాలంలో 570 మందికి పైగా, 25 మంది ఆరు దేశాల సభ్యులు పాల్గొన్నారు. సాహిత్య తరంగిణి అనే పత్రికలో ఐఎస్ఎస్ఎన్ 3048 - 5908 అనే ప్రచురణ నంబర్‌తో పుస్తక ప్రచురణ చేశారు. ప్రసాద్‌బాబు మాట్లాడుతూ మనుషుల ప్రవర్తనలను సాహిత్యం మార్పు చేస్తుందన్నారు. తెలుగు శాఖ అధ్యాపకులు జి.వెంకట్‌లాల్ మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం ద్వారా తెలుగు భాషను సంరక్షించుకోవచ్చున్నారు. మార్షియస్ నుంచి సంజీవ నరసింహ అప్పడు, మలేషియా నుంచి ఆచార్య పామిరెడ్డి సుధీర్ రెడ్డి, సింగపూర్ నుంచి పద్మజా నాయుడు, జర్మనీ నుంచి తొట్టెంపూడి గణేష్ మాట్లాడుతూ తమ దేశాల్లో చేస్తోన్న తెలుగు భాష అభివృద్ధిని వివరించారు. ప్రత్యేక ఉపన్యాసకులు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు లక్కిరెడ్డి హనీమిరెడ్డి, ఇళ్లా రవి, ఎస్ జగన్ మోహన్‌రావు, మణిందర్ రావు, ప్రొఫెసర్ టి.సత్యనారాయణ తదితరులు మాట్లాడారు.

సమాచార హక్కు చట్ట దినోత్సవం



చట్టంపై అవగాహన కలిగిస్తున్న దృశ్యం

చింతలపూడి : ప్రతి రైతూ సమాచార హక్కు చట్టం ద్వారా వివరాలు తెలుసుకోవాలని పోతునూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు ఎస్ఎస్ఎన్ గాంధీ అన్నారు. శుక్రవారం సమాచార హక్కు చట్టం దినోత్సవం సందర్భంగా పోతునూరు సొసైటీలో సమాచార హక్కు చట్టంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ చట్టం ద్వారా సొసైటీలో రైతులు ఎంత రుణం పొందారో, ఎంత చెల్లించాలి అన్న వివరాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల కోసం అందించే పథకాల గురించి తెలుసుకోవచ్చని వివరించారు.

సవరణ

అక్టోబర్ 19న పోలవరం 9వ పేజీలో ప్రచురితమైన లీగల్ ప్రకటనలో మొదటి క్లయింట్ పేరును చిత్తపూరి నాగ సత్య వెంకట దుర్గ రమామణి గా చదువుకోగలరు.

Sd/- P.R.K. Amarendra Kumar
M.A.,B.L.,D.P.A
Advocate, Guntur, Cell: 98484 15757